క్లుప్తంగా

యువత తమ బాధ్యతలను తెలుసుకోవాలి



విద్యార్థినుల ఇండక్షన్ ప్రోగ్రాంలో పాల్గొన్న బ్రహ్మకుమారి సిస్టర్ లావణ్య తదితరులు

ఏలూరు (టూటౌన్): సమాజంలో యువత తన బాధ్యతల గురించి అవగాహన పెంపొందించుకోవడంతో పాటు వాటిని తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని బ్రహ్మకుమారి సిస్టర్ సీహెచ్ లావణ్య అన్నారు. స్థానిక సీఆర్ఆర్ మహిళా కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థినులకు స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాం శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన లావణ్య విద్యార్థినులకు డిజైన్ యువర్ డెస్టినీ అనే అంశంపై అవగాహన కల్పించారు. సానుకూల దృక్పథం, వ్యక్తిగత అవగాహన ప్రాముఖ్యత, యువత బాధ్యతలను వివరించారు. కార్యక్రమంలో మహిళా కళాశాల కరస్పాండెంట్ చలసాని విశ్వనాథరావు (నానాజీ), ప్రిన్సిపాల్ పి.శైలజ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ కె.ఝాన్సీ లక్ష్మి, వివిధ శాఖాధిపతులు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఏలూరు విచ్చేసి సెప్టెంబరు 30 నాటికి 79 సంవత్సరాలు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని స్థానిక కోటదిబ్బపై ఉన్న ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించి నాలుగేళ్లయింది. ఈ నేపథ్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం దళిత, బహుజన సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దళిత, బహుజన సీనియర్ నాయకులు నేతల రమేష్‌బాబు మాట్లాడుతూ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను నెరవేర్చడమే ఆయనకిచ్చే నిజమైన నివాళి అని అన్నారు. దళిత నాయకుడు తోటకూర కిషోర్ మాట్లాడుతూ అంబేడ్కర్ వల్లే భారత దేశంలోని ప్రజలంతా సమానంగా జీవిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ డీఈఈ గరికిముక్కు వెంకటేశ్వరరావు, రిటైర్డ్ పోస్టు మాస్టర్ దాసి వెంకటేశ్వర్లు, బీసీ నాయకులు మేడిశెట్టి గిరిబాబు, సమతా సైనిక్ దళ్ నాయకులు ఈపిజర్ల మణిరాజు, బోసు శిబిరానికి చెందిన కొత్తల పూర్ణ మల్లికార్జున్, రెల్లికుల సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు భూపతి అప్పారావు, బీఎస్పీ నాయకులు కర్రె అంబేడ్కర్, దాసరి సుభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యం, ఆర్థిక భద్రతే లక్ష్యం



పాలగూడెంలో జగనన్న ఆరోగ్య సురక్షను ప్రారంభించి బీపీ టెస్ట్ చేయించుకుంటున్న ఎంపీపీ శ్రీనివాసరాజు



వైద్య శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి



మహిళకు కంటిపరీక్ష చేస్తున్న వైద్యులు



వృద్ధుడికి వైద్య పరీక్ష చేస్తున్న డాక్టర్

ఏలూరు రూరల్: ప్రజల ఆరోగ్య, ఆర్థిక భద్రత కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నారని ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు అన్నారు. శనివారం ఏలూరు మండలం పాలగూడెం సచివాలయం వద్ద ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజలు అనారోగ్యానికి గురైతే మండల లేదా జిల్లా కేంద్రాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడేవారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హయాంలో ప్రతి గ్రామంలోనూ వైఎస్సార్ హెల్త్ క్లీనిక్ ద్వారా వైద్య సేవలు అందిస్తున్నారని కొనియాడారు. 108, 104 ద్వారా వెలకట్టలేని సేవలు అందుబాటులోకి తెచ్చారని చెప్పారు. ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి వైద్య శిబిరాన్ని సందర్శించారు. రోగులతో మాట్లాడారు. వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

800 మందికి సేవలు

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ప్రభుత్వ వైద్యులు ఎస్ చందనవల్లి, రోహిత్, ఆంధ్ర హాస్పటల్ గైనకాలజిస్ట్ సునీత, చైత్ర ఆసుపత్రి ఆర్థోపెడిక్ సీహెచ్ తిరుమలేష్ తమ సిబ్బందితో కలిసి 800 మందికి వైద్య సేవలు అందించారు. మందులు పంపిణీ చేశారు. హెచ్ఐవీ, హెచ్‌బీఎస్, టీబీ, బీపీ, షుగర్, క్యాన్సర్, హృద్రోగ తదితర దీర్ఘకాలిక రోగులకు ఉచితంగా ల్యాబ్‌టెస్టులు చేసేందుకు ఆరోగ్యశ్రీ అనుభంధ ఆసుపత్రులకు రిఫర్ చేశారు. తహసీల్దార్ శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ ఎం సరళకుమారి, హెచ్ఏ కృష్ణమోహన్, సర్పంచ్ పత్యాల సునీత కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. వైఎస్సార్ సీపీ నాయకులు తూతా నిరంజన్, తేరా ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



రోగులకు మందులు అందిస్తున్న సిబ్బంది

ఈవీఎం గోదాం పరిశీలన



గోదాములో యూనిట్లను పరిశీలిస్తున్న కలెక్టర్



విద్యార్థులను అభినందిస్తున్న జిల్లా కలెక్టర్

ఏలూరు(మెట్రో): సాధారణ తనిఖీల్లో భాగంగా శనివారం జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఈవీఎం గోదాంను పరిశీలించారు. జిల్లాకు కేటాయించిన 5560 బ్యాలెట్ యూనిట్లు, 4340 కంట్రోల్ యూనిట్లు, 5210 వీవీపాట్ యంత్రాల పనితీరును పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. గతంలో జిల్లాకు కేటాయించిన 10,564 ఈవీఎం మెషీన్లను దశల వారీగా హైదరాబాద్‌లోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ సంస్థకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కొత్తగా అందించిన ఈవీఎం యంత్రాల స్కానింగ్ అనంత రం ఫస్ట్ లెవెల్ చెకింగ్ పనులను అక్టోబర్ 16 నుంచి ప్రారంభించాలని ఆదేశించారు. యాక్సిప్టెన్స్ టెస్ట్ ప్రొసీజర్ విధానాన్ని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ సంస్థకు చెందిన ఇంజినీర్లు మోనిష్, హర్షవర్ధన్‌లు సిబ్బందికి వివరించారు. బీజేపీకి చెందిన నెరుసు నెలరాజా, బీఎస్పీ పార్టీకి చెందిన సిర్రా భరత్‌కుమార్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ చల్లన్న దొర పాల్గొన్నారు.

అభ్యంతరాలు 98 శాతం పరిష్కారం

జిల్లాలో ఓటర్ల జాబితాలో నమోదు, మార్పులు, చేర్పులు, అభ్యంతరాలపై అందిన దరఖాస్తుల్లో 98 శాతం పరిష్కరించామని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. కలెక్టరేట్‌లోని జిల్లా కలెక్టర్ చాంబర్‌లో శనివారం ఓటర్ల జాబితా సవరణ అంశంపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్షించారు. ఓటర్ల జాబితా సవరణపై ఫారం-6, ఫారం-7, ఫారం-8 విభాగాల్లో 1,10,416 దరఖాస్తులు అందగా, వాటిల్లో 1,01,794 దరఖాస్తులు పరిష్కరించామని, నిబంధనల మేరకు లేని 6,525 దరఖాస్తులను తిరస్కరించామని వివరించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ ప్రక్రియ చేపట్టామని, ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ఓటర్ల జాబితా డ్రాఫ్ట్ పబ్లికేషన్ అక్టోబర్ 17న ముద్రిస్తామన్నారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నెరుసు నెలరాజా, సిర్రా భారత్ కుమార్, అచ్యుత్ బాబు, ఎస్‌వీ ప్రసాద్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ చల్లన్న దొర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

జాతీయ స్థాయిలో షూటింగ్ బాల్ పోటీలో పాల్గొన్న మరియా జోషి, వ్యాసరచనలో రాష్ట్ర స్థాయిలో రూ.15 వేల నగదు బహుమతి అందుకున్న తరుణ్, చరణ్, మహేష్‌లను జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అభినందించారు. శనివారపుపేట జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులు శనివారం జిల్లా కలెక్టర్ వె. ప్రసన్నవెంకటేష్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా స్థాయిలో ఆరోగ్య శాఖ నిర్వహించిన క్విజ్ పోటీలో ప్రథమ బహుమతి అందుకున్న వైష్ణవి, తనూషలను, డ్రాయింగ్ పోటీల్లో విశేష ప్రతిభ కనపరుస్తున్న ఎతికరిమి ప్రత్యూషలను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి శ్యామ్‌సుందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.ప్రకాష్, ఉపాధ్యాయులు రాజ్ కుమార్, ఇర్షద్ అహ్మద్, ఉమామహేశ్వరి, జయసుభ, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే ధ్యేయం

ఎమ్మెల్యే ఆళ్ల నాని



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందించిన ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు టౌన్: ఏలూరు నియోజకవర్గంలో ప్రతి పేదవానికీ గూడు కల్పించాలనే ఉన్నత లక్ష్యంతో పనిచేస్తున్నామని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షులు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో అమీనా పేట, గొల్లాయగూడెం, హనుమాన్ నగర్, గాంధీ నగర్, సాయి నగర్ ప్రాంతాలకు చెందిన 125 మందికి ఎమ్మెల్యే చేతుల మీదుగా శనివారం ఇంటిస్థల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు పటిష్ట ప్రణాళిక అమలు చేస్తున్నామని వివరించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు అర్హులందరికీ నివాస స్థలం కల్పించేలా చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. స్థలంతో పాటుగా ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు మంజూరు చేస్తామని తెలిపారు. ప్రజలకు మంచి చేస్తున్న తమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఆయన కోరారు. ఇళ్ల పట్టాలు అందుకున్న వారంతా తమ సమస్యలపై సత్వరమే స్పందించి తమకు నివాస స్థలాలపై హక్కును కల్పించి, పట్టాలు మంజూరు చేసిన ఆళ్ల నానికి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే నానిని గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బందారు సునీత కిరణ్, కలవకొల్లు సాంబ, పోతర్లంక లక్ష్మణ్, దారపు అనూష తేజ, యర్ర శెట్టి నాగబాబు, తహసీల్దార్ సోమశేఖర్ రావు, షేక్ సత్తార్, ఎలమంచిలి శేషు,నగర కమిషనర్ వెంకటకృష్ణ, డిప్యూటీ మేయర్ ఎన్ సుదీర్ బాబు పాల్గొన్నారు.

నేరాల నిరోధానికి పటిష్ట చర్యలు



డీఎస్పీ కార్యాలయంలో సమీక్షిస్తున్న జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి, చిత్రంలో డీఎస్పీ శ్రీనివాసులు

ఏలూరు టౌన్: ఏలూరు పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలో నేరాలను నిరోధించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని, నేరగాళ్లపై మరింత నిఘా ఉంచాలని ఎస్పీ డి.మేరీ ప్రశాంతి అన్నారు. ఏలూరు డీఎస్పీ కార్యాలయాన్ని శనివారం ఆమె తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా డీఎస్పీ ఈ.శ్రీనివాసులుతో సబ్ డివిజన్‌లోని నేరాల నమోదు, దర్యాప్తు, పరిష్కారాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మేరీ ప్రశాంతి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అనుమానాస్పద మృతులు, హత్యలు, లైంగిక, వరకట్న వేధింపులు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, పోక్సో కేసుల్లో దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. నాటుసారా, మద్యం అక్రమరవాణా, గంజాయి, మత్తుపదార్థాల రవాణా, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. ఏలూరు సబ్‌డివిజన్ పరిధిలో రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీట్, పాత నేరస్తులపై నిఘా మరింత పెంచాలన్నారు.

స్వచ్ఛతా హీ సేవలో భాగస్వామ్యం కావాలి

ఏలూరు టౌన్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని నగర కమిషనర్ సంక్రాంతి వెంకట కృష్ణ కోరారు. ఏలూరు కార్పొరేషన్ కార్యాలయంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంపై నగర కమిషనర్ శనివారం విలేకర్లతో మాట్లాడారు. అక్టోబర్ 2వ గాంధీజీ 154వ జయంతి పురస్కరించుకుని స్థానిక ఏఎస్ఆర్ స్టేడియంలో స్వచ్ఛతా హీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఉదయం 8.30 నుంచి 9.30 వరకు స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం ఏర్పాటు చేశామని, ప్రాముఖ్యతను ప్రచారం చేస్తూ సంపూర్ణ పారిశుద్ధ్యంపై అవగాహన కల్పిస్తామని వివరించారు. ప్రతి పౌరుడూ, ప్రజా ప్రతినిధులు, అధికారులు, సీనియర్ సిటిజన్స్ ఒక గంట పాటు శ్రమదానంలో పాల్గొనాలని కోరారు.

3న బ్లాక్ డే

ఏలూరు (టూటౌన్): ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా ఉత్తరప్రదేశ్‌లోని లకింపూర్ ఖేరిలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి అజయ్ మిశ్రా కుమారుడు చేసిన హత్యాకాండకు నిరసనగా సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం), కేంద్ర కార్మిక సంఘాల సమన్వయ కమిటీ సంయుక్తంగా దేశవ్యాప్త పిలుపులో భాగంగా అక్టోబర్ 3న బ్లాక్ డేను విజయవంతం చేయా లని రైతు సంఘాలు, కార్మిక సంఘాల నాయకులు పిలుపు నిచ్చారు. ఏలూరులోని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యాలయంలో సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల సమన్వయ కమిటీ జిల్లా సంయుక్త సమావేశం శనివారం నిర్వహించారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా మోదీ ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు కె.శ్రీనివాస్, బండి వెంకటేశ్వరరావు, రాజనాల రామ్మోహనరావు, ఎస్‌కే గౌస్, బద్దా వెంకట్రావు, బి.సోమయ్య, నిమ్మగడ్డ నర్సింహ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలిగా హేమసుందరి



నానికి పుష్పగుచ్ఛం అందిస్తున్న హేమసుందరి

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాల సాధనకు, ఎమ్మెల్యే ఆళ్ల నాని అడుగుజాడల్లో పార్టీని మరింత బలోపేతానికి, 2024 ఎన్నికల్లో విజయానికి కృషి చేస్తామని కార్పొరేటర్ భీమవరపు హేమసుందరి తెలిపారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే నానిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఏలూరు జిల్లా వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం ఉపాధ్యక్షురాలిగా నియమించేందుకు కృషి చేసిన ఆళ్ల నానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు భీమవరపు సురేష్, యువ నాయకులు ఉన్నారు.

స్వామినాథన్, నాగేంద్రనాథ్‌ల మృతి తీరనిలోటు



నివాళులర్పిస్తున్న రైతు సంఘాల నేతలు

ఏలూరు (టూటౌన్): వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ మృతి దేశానికి, రైతాంగ పోరాట యోధుడు ఎర్నేని నాగేంద్రనాథ్ మృతి రైతాంగ ఉద్యమాలకు తీరని లోటని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) నాయకులు పేర్కొన్నారు. స్థానిక ఇఫ్టూ జిల్లా కార్యాలయంలో స్వామినాథన్, నాగేంద్రనాథ్ సంతాప సభ ఎస్‌కేఎం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా జోహార్లర్పించారు. వారి కుటుంబాలకు సానుభూతిని ప్రకటించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భారత దేశ హరిత విప్లవ పితామహుడు, ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్ వ్యవసాయ రంగానికి చేసిన సేవలను కొనియాడారు. ఆహార వృద్ధిలో దేశం స్వయం సమృద్ధి సాధించేందుకు విశేష కృషి చేశారని గుర్తుచేశారు. అధిక దిగుబడినిచ్చే వరి వంగడాలను అభివృద్ధి చేయడంలో స్వామినాథన్ కీలకపాత్ర పోషించారని చెప్పారు. నాగేంద్రనాథ్ నిస్వార్థంగా అంకితభావంతో రైతాంగ ఉద్యమాలు నిర్వహించారన్నారు. సాగునీటి ప్రాజెక్టులు, మద్దతు ధరలు వంటి అంశాలపై లోతైన అధ్యయనంతో ప్రభుత్వాలను ప్రశ్నించే వారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నిమ్మగడ్డ నర్సింహ, కె.శ్రీనివాస్, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా నాయకులు రాజనాల రామ్మోహన్‌రావు, ఏపీకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌కే గౌస్, జిల్లా కార్యదర్శి బి.సత్యనారాయణ, ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్తీక మాసంలో దీక్షాధారులకు భిక్ష

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అన్నపూర్ణ సమేత హరిహరపుత్ర అయ్యప్పస్వామి అన్నదాన సమాజం ఆధ్వర్యంలో వచ్చే కార్తీక మాసం మొత్తం అయ్యప్ప దీక్షాధారులకు భిక్ష కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్టు సమాజం అధ్యక్షుడు కొట్టు మధు వెంకటరావు తెలిపారు. శనివారం స్థానిక రామకోటి ప్రాంగణంలోని రామాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. నూకల రామకృష్ణ, అమ్మాజీ, దాతలు, గురుస్వాముల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్టు చెప్పారు. నవంబర్ 8 నుంచి డిసెంబర్ 22 వరకు 45 రోజుల పాటు భిక్ష కొనసాగుతుందన్నారు. భిక్ష కార్యక్రమ కరపత్రం విడుదల చేశారు. సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్, అన్నదాన సమజాం గౌరవాధ్యక్షుడు నూక ల రామకృష్ణ, కార్యదర్శి సామర్ల కిరణ్ కుమార్, కోశాధికారి మద్దుల గోపాల్, కొట్టు మనోజ్, గుర్రాల రాజశేఖర్, నిట్టల అజయ్ శర్మ పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

ఏలూరు (టూటౌన్): విద్యార్థులు ఇష్టపడి చదవడం ద్వారా తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని ఎమ్మెల్సీ షేక్ సాబ్జి అన్నారు. స్థానిక ఏవీఆర్ విజ్ఞాన కేంద్రంలో 40 రోజుల పాటు షార్ట్ టర్మ్ ఇంటర్న్ షిప్ పూర్తి చేసుకున్న కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌లో బీఏ చదువుతోన్న విద్యార్థులకు శనివారం సర్టిఫికెట్లు అందజేశారు. స్థానిక ఏవీఆర్ విజ్ఞాన కేంద్రంలో డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ జి.గిరిబాబు అధ్యక్షతన ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ సాబ్జి మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు పట్టుదలతో కృషి చేయాలన్నారు. ప్రిన్సిపాల్ గిరిబాబు మాట్లాడుతూ షార్ట్ టర్మ్ ఇంటర్న్‌షిప్ ద్వారా పలు అంశాలతోపాటు కంప్యూటర్ శిక్షణ ఇచ్చిన ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కమిటీకి అభినందనలు తెలిపారు. ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, శిక్షకులు ఎం.లక్ష్మి, వై.ఆనందనాయుడు, పి.ఆంజనేయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	18
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	27
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	21
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	36

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	13
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	24
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	03
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	18
ఏలూరు బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	20
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	25
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -తిరుపతి	16.00	4830	33

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర		
టమాటాలు	20	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	40	చిక్కుడు కాయలు	60
వంకాయలు (కాంతులు)	40	చామదుంపలు	40
వంకాయలు (తెలుపు)	40	ములక్కాడలు	05-07
బెండకాయలు	20	కంద	40
పచ్చిమిర్చి	36	బీట్‌రూట్	40
కాకర కాయలు	24	కీరా దోస	38
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	20	అల్లం	120-240
క్యారెట్	36	కొత్తిమీర (కట్ట)	30
దొండకాయలు	20	పాలకూర	10
బంగాళదుంపలు	26	చుక్కకూర	10
ఉల్లిపాయలు	32	తోటకూర	10
గోరుచిక్కుడు	30	గోంగూర	06
దోసకాయలు	20-26	పుదీనా	05
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	68
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	40
		నిమ్మకాయలు (డజను)	--